
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

కృష్ణా జిల్లా వార్తలు

మంగళవారం 14 మే 2024







మచిలీపట్నంలో ఓటేసిన కలెక్టర్ దంపతులు

ఓటర్లు చైతన్యవంతులై కదిలారు. చెరగని ఆత్మవిశ్వాసంతో ముందుకు నడిచారు. ఎండను సైతం లెక్కచేయక గంటల తరబడి క్యూల్లోనే నిలబడి ఓటు వేశారు. జిల్లావ్యాప్తంగా సోమవారం జరిగిన ఎన్నికల ప్రక్రియ ఓట్ల జాతరను తలపించింది. ఉదయం 7 గంటలకు మొదలైన పోలింగ్ రాత్రి వరకూ కొనసాగింది. ముదుసలుల నుంచి నవయువ ఓటర్ల వరకూ ప్రతి ఒక్కరి నుంచీ విశేష స్పందన లభించింది. దివ్యాంగులు సైతం మొక్కవోని దీక్షతో తరలివచ్చారు. ఈవీఎంలు మొరాయించడంతో చాలాచోట్ల పోలింగ్ ఆలస్యంగానే జరిగింది. అయినా ఓటరన్న వెనుదిరగక పట్టుదలతో ఓటేసి ఐదేళ్ల భవితకు పునాది వేసుకుని, తుది తీర్పును ఈవీఎంలలో భద్రపరిచాడు.



గుడ్లవల్లేరు మండలం డోకిపర్రులో పోటెత్తిన ఓటర్లు (ఇన్‌సెట్‌లో) దేశాయిపేటలో బారులు తీరిన ముస్లిం మహిళలు

# ఓట్ల జాతర

## జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన పోలింగ్





ఓటు వేసిన వృద్ధురాలు

- చెదురుమదురు ఘటనలు మినహా సజావుగానే..
- పోటెత్తిన ఓటర్లు.. జిల్లాలో 82.20 శాతం పోలింగ్
- ఉదయం 7 గంటల నుంచి మొదలైన రద్దీ
- రాత్రి 6 గంటలకు క్యూలో ఉన్నవారికీ అనుమతి
- మొరాయించిన ఈవీఎంలు.. పోలింగ్ ఆలస్యం
- గంటల తరబడి క్యూల్లోనే పడిగాపులు
- ఓటరు తీర్పు ఈవీఎంలలో నిక్షిప్తం
- భారీ భద్రతా ఏర్పాట్ల నడుమ స్ట్రాంగ్‌రూమ్‌లకు..

**ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం :** జిల్లాలో ఓటుహక్కు వినియోగించుకునేందుకు ఓటర్లు పోటెత్తారు. గంటల తరబడి క్యూలో నిలబడి మరీ ఓటేశారు. సోమవారం ఉదయం 6 గంటలకే ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. మాక్ పోలింగ్ ముగిశాక ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. ఈవీఎంలలో సాంకేతికలోపాలు తలెత్తడంతో వాటిని మార్చాల్సి వచ్చింది. దీంతో పోలింగ్ ప్రక్రియ కొంతమేర ఆలస్యమైంది. అయినా రెండు, మూడు గంటల పాటు ఓటర్లు క్యూలోనే నిలబడాల్సి వచ్చింది. చెదురుమదురు సంఘటనలు మినహా పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగానే ముగిసింది.

### ఈవీఎంలతో ఆలస్యం

పోలింగ్ ప్రక్రియ సోమవారం 6 గంటల వరకు సమయం ఉండగా, ఆ సమయానికి క్యూలో ఉన్న ఓటర్లను కూడా అనుమతించారు. మచిలీపట్నంలోని హిందూ కళాశాల, పల్లెతుమ్మలపాలెంలో ఈవీఎంలు మొరాయించాయి. దీంతో అక్కడ అరగంట ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. చిలకలపూడి పోలింగ్ కేంద్రంలో వైసీపీ అభ్యర్థి పేర్ని కిట్టు, టీడీపీ అభ్యర్థి కొల్లు రవీంద్ర ఒకేసారి రావడంతో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. గుడివాడ పట్టణంలో వలంటీర్.. పోలింగ్ ఏజెంటుగా రాగా పీవో అడ్డుచెప్పారు. దీంతో ఎమ్మెల్యే కొడాలి నాని పీఏ సంబంధిత పోలింగ్ అధికారిపై దురుసుగా ప్రవర్తించడంతో అక్కడ కూడా కొంతసేపు ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. మచిలీపట్నం శారదానగర్ పోలింగ్ కేంద్రం వద్ద పోలింగ్ గడువు ముగిసే సమయానికి 200 మందికిపైగా ఓటర్లు ఉన్నారు. గుడివాడ నియోజకవర్గంలోని రామనపూడి, మల్లాయపాలెం, గుడివాడ పట్టణంలోని 10 పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించాయి. నందివాడ, జొన్నపాడు, రుద్రపాక, కాళింగిపేట, గుడ్లవల్లేరు మండలం కూరాడ, డోకిపర్రులో ఈవీఎంలు మొరాయించాయి. వలివర్తిపాడులో నాలుగుసార్లు ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ ఆలస్యమైంది. గుడివాడ మండలం చిరిచింతలలోనూ ఇదే పరిస్థితి ఏర్పడగా, రాత్రి 7.30 గంటల సమయంలో కొత్త ఈవీఎం ఏర్పాటు చేశారు. లింగవరంలో ఈవీఎం బ్యాటరీ చార్జ్ అయిపోవడంతో పోలింగ్ నిలిచి ఆలస్యమైంది. మోటూరు, చౌటపల్లి పోలింగ్ కేంద్రాల్లోనూ ఇదే పరిస్థితి. అవనిగడ్డ నియోజకవర్గం నాగాయలంక మండలం కమ్మనమోలు, తలగడదీవి, అవనిగడ్డ మండలం వేకనూరు, మోపిదేవి మండలం వెంకటాపురంలో ఈవీఎంల సమస్యే వేధించింది. పెడన నియోజకవర్గం చినపాండ్రాక 202వ నెంబరు పోలింగ్ బూత్‌లో ఇద్దరు మహిళలు తమ ఓట్లు వేరేవారు వేశారనే కారణంతో చాలెంజ్ ఓట్లు వేశారు. పామర్రు నియోజకవర్గంలోని 12 ప్రాంతాల్లోనూ ఈవీఎంలు ఇబ్బంది పెట్టాయి. పమిడిముక్కల మండలం తాడంకి, దూళిపూడిపాలెం, తోట్లవల్లూరు, పెనమకూరు, పాముల్లంక, యాకమూరు, బొడ్డపాడులో రాత్రి 8 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. ఉయ్యూరులో పోలింగ్ సమయం ముగిశాక బూత్‌లోకి వస్తున్న వైసీపీ నాయకుడు రామచంద్రరావును పోలీసులు అడ్డుకున్నారు. ఆయన వారిని తోసేశారు.

### ఓటుహక్కు వినియోగించుకున్న కలెక్టర్

**మ**చిలీపట్నం సెయింట్ ఫ్రాన్సిస్ ఉన్నత పాఠశాలలో కలెక్టర్ డీకే బాలాజీ సతీసమేతంగా తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. క్యూలోనే వెళ్లి ఓటు వేశారు.

### అర్ధరాత్రి వరకూ పోలింగ్

**బందరులోని పల్లెతుమ్మలపాలెం కేంద్రంలో..**

**మచిలీపట్నం, ఆంధ్రజ్యోతి :** మచిలీపట్నంలో పోలింగ్ సోమవారం అర్ధరాత్రి వరకూ కొనసాగింది. పల్లెతుమ్మలపాలెం పోలింగ్ కేంద్రంలో అర్ధరాత్రి వరకూ జనం క్యూల్లోనే ఉండి ఓటు వేసి వెళ్లారు. గాంధీ విద్యాలయం, జైహింద్ హైస్కూల్లో కూడా దాదాపు అర్ధరాత్రి వరకూ కొనసాగింది. కాగా, జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో సోమవారం రాత్రి 9.30 గంటల వరకు ఓటింగ్ శాతం ఇలా ఉంది. అవనిగడ్డ నియోజక వర్గంలో 84.17, గుడివాడలో 79.96, గన్నవరంలో 79.22, మచిలీపట్నంలో 77.17, పామర్రులో 86.47, పెడనలో 86.77, పెనమలూరులో 76.81 శాతం మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు.



పామర్రులో నడవలేని స్థితిలో వస్తున్న ఓ వృద్ధురాలు



మొక్కవోని సంకల్పంతో..



కానూరు కెనడీ స్కూల్ వద్ద బారులు తీరిన ఓటర్లు

# వైసీపీ వీరంగం

## ప్రశాంతమైన పోలింగ్‌కు విఘాతం

- పెనమలూరులో జోగి రమేశ్ కుమారుల బీభత్సం
- టీడీపీ కార్యకర్తలపై దాడి.. ఇద్దరికి తీవ్ర గాయాలు
- ఓటమి భయంతో గన్నవరంలో వంశీ పిల్ల చేష్టలు
- యార్లగడ్డ కారుకు అడ్డు.. దాడికి విఫలయత్నం

ప్రశాంతంగా జరగాల్సిన పోలింగ్‌ను రణరంగంలా మార్చారు. కయ్యానికి కాలు దువ్వి ఒకరినొకరు కొట్టుకునేలా చేశారు. అటు పోరంకిలో వైసీపీ అభ్యర్థి జోగి రమేశ్ కుమారులు సృష్టించిన బీభత్సం.. ఇటు గన్నవరంలో వైసీపీ అభ్యర్థి వల్లభనేని వంశీమోహన్ కవ్వింపు చర్యల కారణంగా ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. - విజయవాడ, ఆంధ్రజ్యోతి



ముస్తాబాద-సూరంపల్లి రహదారిలో టీడీపీ-వైసీపీ నేతల గొడవ



ఉప్పలూరులో జోగి అనుచరుల హడావిడి (ఇన్‌సెట్‌లో) గాయపడిన కార్యకర్తకు బోడె ప్రసాద్ పరామర్శ

### పోరంకిలో జోగి కుమారుల తెగింపు

పోరంకి ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రం వద్ద సోమవారం తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. మంత్రి జోగి రమేశ్, ఆయన కుమారులు.. మైలవరం, పెడన నియోజకవర్గాల నుంచి తీసుకొచ్చిన వారితో పోలింగ్ కేంద్రం వద్ద వీరవిహారం చేశారు. టీడీపీ కూటమి అభ్యర్థి బోడె ప్రసాద్ సోదరుడు సురేశ్, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి బోడె మనోజ్‌పై దాడి చేశారు. దాడిలో టీడీపీ కార్యకర్తలు వీర్ల రాజేశ్, షరీఫ్ తీవ్రంగా గాయపడ్డారు. వీర్ల రాజేశ్‌కు తలపై బలమైన గాయాలయ్యాయి. ఈ వివాదం సద్దుమణిగిన కొద్దిసేపటికే జోగి రమేశ్ పెద్ద ఎత్తున తన అనుచరులతో పోలింగ్ కేంద్రంలోకి చొరబడ్డారు. కమ్మ కార్పొరేషన్ చైర్మన్ చక్రవర్తితో కలిసి దొంగ ఓట్లు వేయించే ప్రయత్నం చేయడంతో టీడీపీ నాయకులు అడ్డుకున్నారు. దీంతో ఘర్షణ పెరిగి పరస్పరం రాళ్లు రువ్వుకున్నారు. పోలీసులు జోక్యం చేసుకుని ఇరువర్గాలను చెదరగొట్టడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. అదే సమయంలో జోగి తనయుడు రాజీవ్ పోలింగ్ సమయం ముగిసిందంటూ కుర్చీలు ఎత్తేసి హడావిడి చేయడంతో అతన్ని టీడీపీ నాయకులు అడ్డుకున్నారు. తాడిగడప పోలింగ్ కేంద్రం వద్ద కూడా టీడీపీ, వైసీపీ నాయకుల నడుమ ఘర్షణ చోటుచేసుకుంది. ఉప్పులూరు పోలింగ్ స్టేషన్‌లోకి రాజీవ్ తన అనుచరులతో వెళ్లి హడావిడి చేయడంతో టీడీపీ నాయకులు వారిని అడ్డుకున్నారు.

### గన్నవరంలో వంశీ కవ్వింపు

గన్నవరం నియోజకవర్గంలోనూ పలుచోట్ల ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఓటమి భయంతో వైసీపీ అభ్యర్థి వంశీ అసహనంతో ఊగిపోయారు. అనుచరులను రెచ్చగొట్టి ప్రత్యర్థులపైకి ఉసిగొల్పారు. పలుచోట్ల పోలీసులు ప్రేక్షకపాత్ర పోషించారు. విజయవాడ రూరల్ మండలం నున్న హైస్కూల్, గ్రామ సచివాలయాల వద్ద యార్లగడ్డ వెంకట్రావుపై వంశీ అనుచరులు దాడికి విఫలయత్నం చేశారు. వైసీపీకి చెందిన బొంతు సాంబిరెడ్డి ఏజెంట్‌గా వెళ్లి పోలింగ్ బూత్‌లోనే ఫ్యాన్‌కు ఓటు వేయాలని ప్రచారం చేస్తుండటంతో టీడీపీ ఏజెంట్లు యార్లగడ్డ దృష్టికి తీసుకెళ్లారు. యార్లగడ్డ అక్కడికి చేరుకుని పోలింగ్ బూత్‌లో ఉండి ప్రచారం చేయటం సరికాదని హెచ్చరించారు. దీంతో వైసీపీ శ్రేణులు ఒక్కసారిగా యార్లగడ్డపైకి వచ్చారు. అదే పోలింగ్ కేంద్రం వద్ద బయట కారులో ఉన్న వంశీ తన అనుచరులను రెచ్చగొట్టేలా డైరెక్షన్ ఇచ్చారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారుతుండటంతో సమాచారం అందుకున్న సీపీ రామకృష్ణ అక్కడికి చేరుకుని వంశీ, యార్లగడ్డను పంపేశారు. అక్కడి నుంచి బయటకు వచ్చిన వంశీ.. యార్లగడ్డను కవ్విస్తూ ఘర్షణ వాతావరణం సృష్టించేందుకు ప్రయత్నించారు. యార్లగడ్డ ముస్తాబాద -సూరంపల్లి గ్రామాల మధ్యకు రాగానే వంశీ తన కాన్వాయ్‌ను ఆయన కారుకు అడ్డం పెట్టారు. అప్పటికే అక్కడికి వైసీపీ కార్యకర్తలు పెద్ద ఎత్తున చేరుకున్నారు. వంశీ కారులోనే ఉండి వారిని రెచ్చగొట్టారు. పోలీసులను సైతం లెక్క చేయలేదు. యార్లగడ్డ వెంకట్రావును, టీడీపీ శ్రేణులను బూతులు తిడుతూ.. 'రండి చూసుకుందాం' అంటూ రెచ్చిపోయారు. టీడీపీ నాయకులపైకి చెప్పులు, రాళ్లు విసిరారు.

- గన్నవరం మండలం కేసరపల్లి ఏఎంసీ మాజీ చైర్మన్ పొట్లూరి బసవరావు ఇంటి వద్ద కూడా వంశీ హడావిడి చేశారు. ఆయన ఇంటి ముందుకు వెళ్లి కారు ఆపి, హారన్ కొట్టి భయపెట్టే ప్రయత్నం చేశారు. గ్రంథాలయం వద్ద ఉన్న పోలింగ్ కేంద్రానికి వచ్చిన వంశీ.. అక్కడ బసవరావును చూడగానే కారును రివర్స్‌లో స్పీడ్‌తో పోనిచ్చారు. నేరుగా బసవరావు ఇంటి ముందుకెళ్లి హారన్ మోగించారు. అక్కడికి వైసీపీ శ్రేణులు వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ శ్రేణులు కూడా రావటంతో వంశీ అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఓటమి భయంతోనే తన మీదకు దాడి చేసేందుకు వంశీ వచ్చారని పొట్లూరి బసవరావు తెలిపారు.
- ఉంగుటూరు మండలం తేలప్రోలులో యార్లగడ్డ వెంకట్రావు కారుపై వైసీపీ కార్యకర్తలు రాళ్ల దాడికి తెగబడ్డారు. తేలప్రోలు హైస్కూల్ పోలింగ్ కేంద్రం వద్ద యార్లగడ్డ కారుకు అడ్డంగా నిలబడి వంశీ కవ్వింపు చర్యలకు దిగారు. యార్లగడ్డ కారు అద్దాలను ధ్వంసం చేశారు. ఆయన వర్గీయులు అడ్డుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. పోలీసుల జోక్యంతో ఘర్షణ సద్దుమణిగింది.

### చెదురుమదురు ఘటనలు

- తిరువూరు రూరల్ మండలం కోకిలంపాడులో వైసీపీ సర్పంచ్ భర్త గంగధారి కోటేశ్వరరావు టీడీపీ సానుభూతిపరుడిపై దాడి చేశారు. టీడీపీ కార్యకర్తలు ఆయన్ను వెంబడించారు.
- మైలవరంలో పలు పోలింగ్ కేంద్రాల వద్ద వైసీపీ టోపీలు పెట్టుకుని కొందరు ప్రచారం చేశారు. వలంటీర్లు పోలింగ్ కేంద్రాల సమీపానికి చేరుకుని మరీ ప్రచారం చేయడం గమనార్హం.
- భవానీపురం 23 నుంచి 33 పోలింగ్ స్టేషన్ల వద్ద ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. వైసీపీ, టీడీపీ నాయకులు ఘర్షణకు దిగారు.

# ఓటర్లను తరలించండి

- వలంటీర్లకు వైసీపీ నేతల వాట్సాప్ సందేశాలు
- ఓటర్లను ఉచిత ఆటోల్లో తరలింపు



**విజయవాడ, మే 13 (ఆంధ్రజ్యోతి) :** 'డియర్ వలంటీర్స్. ఇప్పటి వరకు చాలా కష్టపడ్డారు. మరికొన్ని గంటలు కష్టపడండి. ఓటర్లను దగ్గరుండి తీసుకొచ్చి ఓట్లు వేయించండి. ఈ ఒక్కరోజే మనం కష్టపడితే మరోసారి మన ప్రభుత్వాన్ని కాపాడుకుంటాం.' ఇది సోమవారం వాట్సాప్‌ల్లో హల్‌చల్ చేసిన సందేశం. వైసీపీ నేతలు వలంటీర్లకు ఈ సందేశాలను పంపారు. జిల్లాలో వలంటీర్లతో వైసీపీ నేతలు రాజీనామాలు చేయించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత వారిని పార్టీ కార్యక్రమాల కోసం వినియోగించుకుంటున్నారు. ఇప్పుడు ఏకంగా ఎన్నికల్లో పోలింగ్ ఏజెంట్లుగా నియమించారు. ఉదయం నుంచి పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు క్యూ కట్టారు. మధ్యాహ్న భోజన విరామం సమయంలో రద్దీ తగ్గింది. ఈ సమయంలోనే ఓట్లు వేయించాలని వైసీపీ నేతలు వలంటీర్లకు సందేశాలు పంపారు. ఈ సందేశాలను శిరసావహించిన వలంటీర్లు ఆటోల్లో ఓటర్లను తీసుకొచ్చి ఓట్లు వేయించారు. ఓటర్లకు సహాయకులుగా వచ్చినట్టుగా వ్యవహరించిన వలంటీర్లు పోలింగ్ కేంద్రం వద్ద క్యూలో వెళ్లే వరకు ఫ్యాన్‌కు ఓటు వేయాలని బ్రెయిన్ వాష్ చేశారు. వలంటీర్లు మాత్రం ఈ ఎన్నికల్లో వైసీపీ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారని మిగిలిన ఓటర్లు బహిరంగంగా విమర్శలు చేశారు. అన్ని నియోజకవర్గాల్లోనూ దాదాపు ఇదే పరిస్థితి కనిపించింది.

# ఓటు చైతన్యం


- 6లో..

- ఓటు వినియోగించుకున్న ఎన్నారైలు, వృద్ధులు


గుడివాడలో ఓటు హక్కు వినియోగించుకున్న వెనిగండ్ల, కుటుంబసభ్యులు


ఐతవరంలో కుటుంబసభ్యులతో కలిసి ఓటు వేసిన వసంత కృష్ణ ప్రసాద్


కుటుంబ సమేతంగా ఓటు వేసిన బొండా ఉమామహేశ్వరరావు


గొల్లపూడిలో ఓటు వేసిన మాజీ మంత్రి దేవినేని ఉమా


పోరంకి హైస్కూల్‌లో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేసిన బోడె ప్రసాద్


ఓటు వేసిన కేశినేని శివనాథ్


మచిలీపట్నంలో ఓటువేసిన కొల్లు రవీంద్ర, కుటుంబసభ్యులు


పెడనలో ఓటు హక్కు వినియోగించుకున్న కాగిత కృష్ణప్రసాద్, కుటుంబ సభ్యులు



పొన్నవరంలో ఓటుహక్కు వినియోగించుకున్న సుజనా చౌదరి

## అభ్యర్థులకు పరీక్షా కాలం

నిన్నటి వరకు ఎన్నికల ప్రచారంలో తలమునకలైన అభ్యర్థులు సోమవారం కుటుంబసభ్యులతో కలిసి తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. మండుటెండను సైతం లెక్కచేయక.. కొండలు, గుట్టలు ఎక్కి శ్రమతో ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేశారు. ప్రజా సేవ చేసుకునేందుకు తమకు అవకాశం కల్పించాలని రోడ్లపైకి వచ్చి ప్రజలతో మమేకమై అన్ని పనులూ చేశారు. ఓటరు తీర్పు కోసం మరిన్ని రోజులు వేచి వుండక తప్పదు.. అప్పటి వరకు కాస్త విశ్రాంతి లభించటంతో అభ్యర్థులు కుటుంబ సభ్యులతో గడిపేందుకు ఆసక్తి చూపుతున్నారు. మున్ముందు ఉత్కంఠ పరీక్షలో విజయం సాధించాలని కోరుకుంటున్నారు. - విజయవాడ


ఓటుహక్కు వినియోగించుకున్న వర్ల రామయ్య, కుటుంబసభ్యులు


ఓటు వేసేందుకు వెళుతున్న వల్లభనేని బాలశౌరి


జగ్గయ్యపేటలో ఓటు వేసిన పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం


అవనిగడ్డలో ఓటువేసిన మండలి బుద్ధప్రసాద్ దంపతులు


నందిగామలో ఓటుహక్కు వినియోగించుకున్న తంగిరాల సౌమ్య, కుటుంబసభ్యులు


జగ్గయ్యపేటలో 12వ వార్డు సచివాలయంలో ఓటు వేసి వస్తున్న తాతయ్య


మహాత్మాగాంధీ రోడ్డులో టీ తాగుతూ రిలాక్స్ అయిన తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు, పక్కన మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న

## ఎన్నికల టెన్షన్ నుంచి రిలాక్స్ అవుతూ..

**గుణదల :** ఎడతెరిపిలేని ఎన్నికల ప్రచారం.. పోలింగ్.. టెన్షన్ టెన్షన్.. వాతావరణం అనంతరం అభ్యర్థులు కాస్త రిలాక్స్ అయ్యారు. మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్నతో కలిసి టీడీపీ తూర్పు అభ్యర్థి గద్దె రామ్మోహనరావు టీ తాగుతూ రిలాక్స్ అయ్యారు. సోమవారం సాయంత్రం గుణదల పెద్ద బోర్డింగ్ స్కూల్‌లో పోలింగ్ జరుగుతున్న తీరును పరిశీలించి న అనంతరం మహాత్మాగాంధీ రోడ్డులో టీ తాగుతూ రిలాక్స్ అయ్యారు. పోలింగ్ సరళిపై బుద్దా వెంకన్నతో ముచ్చట్లు చెబుతూ కాస్త రిలాక్స్ అయ్యారు. ప్రజల్లో వైసీపీ ప్రభుత్వం పట్ల ఎంత వ్యతిరేకత ఉందనేది ఓటర్లు పోలింగ్ బూత్‌లకు తరలిరావడం చూస్తుంటేనే అర్థం అయిపోతుందన్నారు. పోలింగ్ బూత్‌లకు తరలిరావడం ఒక ఎత్తయితే క్యూలైన్లో గంటలతరబడి వేచి ఉండి ఓట్లు వేయడం మరో విశేషం అన్నారు.

### ఓటు వినియోగించుకున్న ఎన్నారైలు, వృద్ధులు



**హనుమాన్‌జంక్షన్‌రూరల్ :** సార్వత్రిక ఎన్నికల్లో గ్రామీణ ప్రాంతాలతో పాటు విదేశాల్లోని ప్రవాసాంధ్రులు, యువత ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. హైదరాబాద్‌లో కుమారుడి వద్ద ఉంటున్న ఓగిరాలకు చెందిన 95 సంవత్సరాలు మహిళ వేమూరి శకుంతల తన ఓటును వినియోగించుకనేందుకు వచ్చారు. కానుమోలు, బాపులపాడు, కొత్తపల్లి గ్రామాల్లోని ఎన్నారైలు, యువత తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

## ప్రజలు మార్పు కోరుతున్నారు

» **వసంత కృష్ణప్రసాద్**

ప్రజలు స్పష్టమైన మార్పు కోరుకుంటున్నారు.. ప్రజావ్యతిరేక ప్రభుత్వాన్ని గద్దె దింపే సంకేతాలు కనిపిస్తున్నాయి.. గ్రామ గ్రామాన ఓటింగ్‌కు వస్తున్న స్పందనే అందుకు నిదర్శనం. ఓటింగ్ రోజు ప్రకృతి సహకరించడం శుభ పరిణామం. ఓటమి భయంతో వైసీపీ శ్రేణులు రెచ్చగొట్టినా సంయమనం పాటించి అప్రమత్తంగా ఉండాలి. - మైలవరం


మైలవరంలో తొలి ఓటును కూటమికి వేసినట్టు సిరా చూపుతున్న యువతులు

## పోలింగ్ సరళిని సమీక్షించిన నెట్టెం రఘురామ్

**విద్యాధరపురం, మే 13 :** ఎన్టీఆర్ జిల్లాలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సరళిపై విజయవాడ ఆటోనగర్‌లోని జిల్లా టీడీపీ కార్యాలయంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురామ్ సమీక్షించారు. లుక్కా సాయిరాం ప్రసాద్ గౌడ్, వాసం మునియ్య, పామర్తి కిషోర్ తదితరులతో కలిసి ఎప్పటికప్పుడు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలో పోలింగ్‌ను స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్నారు. టీడీపీ నాయకులను సమన్వయం చేశారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలని ఎక్కడా ఆవేశ, కావేశాలకు లోను కావొద్దని సూచనలు చేశారు.

## టీడీపీ ఏజెంట్లపై వైసీపీ నేతల దాడి

**వత్సవాయి, మే 13 :** మండలంలోని డబ్బాగుపల్లి గ్రామంలో 138 నంబరు పోలింగ్‌లో ఇద్దరు టీడీపీ ఏజెంట్లపై వైసీపీ నాయకులు దాడికి పాల్పడి తీవ్రంగా గాయపరిచారు. టీడీపీ ఏజెంట్లు కొత్తపల్లి నవీన్, పెంట్యాల శ్రీనివాసరావులు పోలింగ్ అనంతరం పిచ్చాపాటిగా మాట్లాడుతుంగా వైసీపీ నాయకులు, మాజీ సర్పంచ్ పండగ శ్రీనివాసరావు, కొలగాని కనకరావులు వైసీపీకి మెజార్టీ తగ్గుతుందనే నెపంతో గ్రామంలో మీ పెత్తనం ఏంటని విచక్షణారహితంగా దాడి చేశారు. సకాలంలో పోలీసులు స్పందించడంతో టీడీపీ ఏజెంట్లు ప్రాణాలతో భయపడ్డారు. సమగ్ర దర్యాప్తు చేసి దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని బాధిత టీడీపీ ఏజెంట్లు డిమాండ్ చేశారు. గ్రామంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పికెటింగ్ ఏర్పాటు చేశారు.

# వైసీపీ మూకల కవ్వింపు చర్యలు

» వైసీపీ అభ్యర్థి వంశీ దుందుడుకుతో గన్నవరంలో ఉద్రిక్తత వాతావరణం

» టీడీపీ అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావుపై దాడికి యత్నం

» చెప్పులు విసిరిన వైసీపీ శ్రేణులు.. పోలీసుల ప్రేక్షక పాత్ర

**గన్నవరం, మే 13 :** సాధారణ ఎన్నికల పోలింగ్‌లో భాగంగా గన్నవరం నియోజకవర్గంలో పలు చోట్ల ఉద్రిక్తత నెలకొంది. వైసీపీ మూకలు ప్రతిపక్ష టీడీపీ అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావుపై దాడికి యత్నించారు. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వల్లభనేని వంశీ డైరెక్షన్‌లో ఈ ఘటనలు చోటు చేసుకోగా పోలీసులు ప్రేక్షక పాత్ర పోషించారన్న విమర్శలు వచ్చాయి. విజయవాడ రూరల్ మండలం నున్న హైస్కూల్, గ్రామ సచివాలయాల వద్ద వైసీపీకి చెందిన బొంతు సాంబిరెడ్డి ఏజెంట్‌గా వెళ్లి పోలింగ్ బూత్‌లోనే ఫ్యాన్‌కు ఓటు వేయాలని ప్రచారం చేయడాన్ని యార్లగడ్డ దృష్టికి టీడీపీ నాయకులు తీసుకువెళ్లారు. పోలింగ్ బూత్‌లో ప్రచారం చేయటం సరికాదని హెచ్చరించడంతో వైసీపీ శ్రేణులు రెచ్చిపోయారు. ఒక్కసారిగా యార్లగడ్డ మీదకు వచ్చారు. వంశీ బయట కారులో ఉండే డైరెక్షన్ చేయడంతో సీపీ పీహెచ్‌డి రామకృష్ణ వచ్చి వంశీని రామవరప్పాడు వైపునకు, యార్లగడ్డను సూరంపల్లి వైపునకు పంపించేశారు. అక్కడ నుంచి యార్లగడ్డను కవ్విస్తూ ఘర్షణ వాతావరణం సృష్టించేందుకు వంశీ ముస్తాబాద-సూరంపల్లి గ్రామాల మధ్యలో జాతీయ రహదారి ఫ్లైఓవర్ వద్దకు రాగానే ఆయన కారుకు వంశీ కాన్వాయ్ అడ్డు పెట్టారు. నున్న, ముస్తాబాద, సూరంపల్లి, కొండపావులూరు గ్రామాల నుంచి పెద్ద ఎత్తున వైసీపీ శ్రేణులు అక్కడకు చేరుకోవడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. వంశీ కారులోనే ఉండి వైసీపీ శ్రేణులు రెచ్చగొట్టడంతో పోలీసులను సైతం లెక్క చేయకుండా టీడీపీ శ్రేణులపైకి దూసుకువచ్చారు. యార్లగడ్డ వెంకట్రావును, టీడీపీ శ్రేణులను బూతులు తిడుతూ రండి చూసుకుందాం అంటూ రెచ్చిపోయారు. భయభ్రాంతులకు గురిచేశారు.

### టీడీపీ శ్రేణులపై చెప్పులు, ఫాగ్‌లు..

టీడీపీ శ్రేణులపై వైసీపీ మూకలు దాడికి తెగబడుతూ చెప్పులు, ఫాగ్‌లను విసిరారు. అవి కొంత మంది పోలీసులకు కూడా తగిలాయి. దాంతో పోలీసులు పక్కకి తప్పుకున్నారు. టీడీపీ శ్రేణులు సంయనం పాటించటంతో ఘర్షణ వాతావరణం తగ్గింది.

● పోలీసులు అధికార పార్టీకి కొమ్ము కాస్తున్నారని, వైసీపీ నేతలు చెప్పినట్టుగా నడుచుకుంటున్నారని తీవ్ర విమర్శలు వచ్చాయి. వందలమంది వైసీపీ మూకలు ముందస్తు ప్రణాళికతో వెంకట్రావుపై దాడి చేసేందుకు వస్తే పోలీసులు అడ్డుకోలేకపోయారు. సీఐలు ప్రసాద్, పెద్దిరాజు సిబ్బందితో వచ్చినా వైసీపీ శ్రేణులను నిలవరించకుండా టీడీపీ వారిని వెళ్లిపోవాలని హెచ్చరించారు. చెప్పులు విసిరినా కనీసం నియంత్రించలేదు. రెండు వర్గాలు ఎటువాళ్లు అటు వెళ్లిపోయాక సంఘటన స్థలానికి డీఎస్పీ జయసూర్య పోలీసు బలగాలు రావటం గమనార్హం.


ముస్తాబాద-సూరంపల్లి గ్రామాల మధ్య జాతీయ రహదారి ఫ్లైఓవర్ వద్ద ఉద్రిక్త వాతావరణం

●గన్నవరం మండలం కేసరపల్లి ఏఎంసీ మాజీ చైర్మన్ పొట్లూరి బసవరావు ఇంటి ముందుకు వెళ్లి కారు హారన్ కొట్టి భయభ్రాంతులకు గురిచేశారు. గ్రంథాలయం వద్ద ఉన్న పోలింగ్ కేంద్రానికి వచ్చిన వంశీ బసవరావును చూడగానే కారును రివర్స్‌గా స్పీడ్‌తో పోనిచ్చారు. వీరబాబుకు తృటిలో ప్రమాదం తప్పింది. ఓటమి భయంతోనే తన మీదకు దాడి చేసేందుకు వచ్చాడని పొట్లూరి బసవరావు తెలిపారు. ముస్తాబాదలో కూడా వైసీపీ శ్రేణులు రెచ్చిపోయి టీడీపీ షామియానాలు పడేశారు.

## టీడీపీ-వైసీపీ కార్యకర్తల ఘర్షణ

» లాఠీఛార్జి.. పలువురికి గాయాలు

**గంపలగూడెం :** దివ్యాంగులు ఓటు హక్కు వినియోగించుకునే విషయంలో తహసీల్దార్ అభ్యంతరం తెలపడంతో టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య ఘర్షణ తలెత్తింది. పోలీసులు లాఠీచార్జి చేయడంతో ఐదుగురు టీడీపీ కార్యకర్తలకు గాయాలయ్యాయి. మండలంలోని సొబ్బాల పోలింగ్ కేంద్రంలో దివ్యాంగులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు వచ్చారు. వారికి సంబంధించిన వారు పోలింగ్ కేంద్రంలోని వెళ్లేందుకు వీలు లేదని వైసీపీ కార్యకర్తలు అభ్యంతరం వ్యక్తం చేశారు. తహసీల్దార్ కూడా అభ్యంతరం తెలపడంతో ఆమెకు టీడీపీ నాయకులు మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. వైసీపీ వర్గీయులు టీడీపీ వర్గీయులతో ఘర్షణకు దిగడంతో పోలీసులు లాఠీ చార్జ్ చేశారు. ఐదుగురు టీడీపీ కార్యకర్తలకు గాయాలయ్యాయి. అనంతరం తహసీల్దార్ వ్యవహార శైలిపై రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేయగా ఆర్వో ఆదేశాల మేరకు వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్న తహసీల్దార్‌ను బయటకు పంపేశారు.

## గోడలు దూకి ఓటేసిన వైసీపీ సానుభూతిపరులు!

**జి.కొండూరు:** పోలింగ్ సమయం ముగియడంతో అధికారులు వెలగలేరు ఎంపీపీ పాఠశాలలోని పోలింగ్ బూత్ నంబరు 149కి చెందిన గేట్లు మూసేశారు. వైసీపీ సానుభూతిపరులు 10 మంది ప్రహరీ దూకి లోనికి ప్రవేశించి అధికారుల అండతో ఓట్లు వేశారు. కాని టీడీపీ సానుభూతిపరుల్ని మాత్రం పోలీసులు, అధికారులు వివక్షతో పోలింగ్ కేంద్రంలోకి అనుమతించలేదు. దీంతో ఈవిషయంపై అధికారులకు ఫిర్యాదు చేసినా వైసీపీ సానుభూతిపరుల్ని బయటకు తీసుకురాలేదు. వైసీపీ సానుభూతిపరులతో ఓట్లు వేయించిన అధికారులు టీడీపీ సానుభూతిపరుల్ని మాత్రం లోనికి అనుమంతిచలేదని టీడీపీ నాయకులు ఆందోళన చేశారు. అక్కడ స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు, అధికారులు అధికార పార్టీకి కొమ్ము కాస్తున్నారని టీడీపీ నేతలు ఆరోపించారు.

## పెనమలూరు నియోజకవర్గంలో..

» టీడీపీ వర్గీయులపై వైసీపీ గూండాల దాడి

» ఇద్దరికి గాయాలు, ఆసుపత్రికి తరలింపు

» పరస్పరం రాళ్లు రువ్వుకున్న ఇరు వర్గాలు

» జోగి అనుచరుల వీరంగం.. కింద పడిన సీఐ

» ఎస్పీ రాకతో సద్దుమణిగిన వివాదం

**పెనమలూరు, మే 13 :** పెనమలూరు నియోజకవర్గం పోరంకి ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రం వద్ద సోమవారం తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మంత్రి జోగి రమేష్, అతడి కుమారులు, మైలవరం, పెడన గూండాలు పోలింగ్ కేంద్రం వద్ద వీరవిహారం చేశాయి. టీడీపీ కూటమి అభ్యర్థి బోడె ప్రసాద్ సోదరుడు బోడె సురేష్, తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి బోడె మనోజ్‌లపై దాడికి పాల్పడ్డారు. టీడీపీ కార్యకర్తలు వీర్ల రాజేష్, షరీఫ్‌లకు గాయాలయ్యాయి. వారిని స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అనంతరం బోడె అనుచరులతో పోలింగ్ కేంద్రం సమీపంలో బైఠాయించగా.. జోగి రమేశ్ అనుచరులతో పోలింగ్ కేంద్రంలోకి చొరబడ్డారు. విషయం తెలుసుకొన్న టీడీపీ వర్గాలు పోలింగ్ కేంద్రంలోకి దూసుకెళ్లగా.. ఇరు వర్గాల మధ్య ఘర్షణతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సీఐ రామారావు ఉన్నతాధికారులకు పరిస్థితులను నివేదించడంతో ప్రత్యేక డీఎస్పీ ఆధ్వర్యంలో పోలీసు బృందం పోలింగ్ కేంద్రానికి చేరుకుని పరిస్థితులను చక్కబెట్టే ప్రయత్నం చేశారు. విషయం తెలుసుకొన్న కృష్ణా ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ పోలింగ్ కేంద్రానికి చేరుకొని అక్కడ ఉన్న వైసీపీ గూండాలను చెదరగొట్టారు. బోడె ప్రసాద్‌తో ఎస్పీ సంయమనం పాటించాలని సూచించారు. విచారణ జరిపి తగుచర్యలు తీసుకొంటామని ఎస్పీ తెలిపారు. ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకొంటామని పేర్కొన్నారు. ఘటనను చిత్రీకరిస్తున్న విలేకరి వద్ద వైసీపీ కార్యకర్త సెల్ ఫోన్ లాక్కొని అతడిపై దాడి చేశాడు.


పోరంకిలో పోలింగ్ కేంద్రం వద్ద గుమికూడిన వైసీపీ మూకలు

**బ్రాయిలర్ ధరలు**

| అమరావతి | (రూ.లలో) |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 150, 159, 170 |
| చికెన్ విత్ స్కిన్ | 290 |
| చికెన్ స్కిన్‌లెస్ | 300 |



**నెక్ కోడిగుడ్డు ధర**
విజయవాడ జోన్ రైతు ధర రూ.5.40

## ప్రసాదంపాడులో రాత్రి 8.10 వరకు ఓటింగ్

**గుణదల, మే 13 :** ఓట్లు వేసేందుకు ఓటర్లు సోమవారం ఉదయం నుంచి భారీగా తరలి రావడంతో ప్రసా దంపాడు ఏపీ సీడ్స్ ఆవరణలో సందడి నెలకొంది. ఉదయం నుంచి మొదలు రాత్రి వరకు ఓటర్లు వెల్లువెత్తారు. ఓటింగ్ సమయం ఉదయం 7 నుంచి సాయంత్రం 6గంటల వరకు కాగా సమయం ముగియడంతో గేట్లు మూసేశారు. అయితే అప్పటికే ఓట్లు వేయడానికి క్యూలైన్లలో ఓటర్లు బారులు తీరి నిలబడటంతో ఓటింగ్ విధానం పూర్తయ్యే సరికి రాత్రి 8గంటల పదినిమిషాలయింది.



## కొత్తమల్లవల్లిలో ఎన్నికల చీఫ్ ఏజెంట్ ఆళ్లపై దాడి

● దుస్తులు చించేయడంతో పాటు కారు అద్దాలు పగలగొట్టిన వైనం ● వీరవల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు



మూకదాడిలో చిరిగిపోయిన దుస్తుల్లో ఆళ్ల గోపాలకృష్ణ

**హనుమాన్‌జంక్షన్‌రూరల్, మే 13 :** ఓటు వేసేందుకు ఆధారాలతో (ఓటర్ కార్డు) వచ్చిన ఓటర్లను అడ్డుకుంటున్నారనే సమాచారంతో కొత్తమల్లవల్లి పోలింగ్ బూత్‌కు వెళ్లిన చీఫ్ ఏజెంట్ ఆళ్ల గోపాలకృష్ణపై వైసీపీ శ్రేణులు మూక దాడి చేశాయి. బాధితుడు ఆళ్ల గోపాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థి పొట్లూరి రవీంద్రకుమార్‌కు చీఫ్ ఎలక్షన్ ఏజెంటుగా వ్యవహరిస్తున్నానన్నారు. మల్లవల్లి పారిశ్రామికవాడలో నివసిస్తున్న 50 మంది ఓటర్లను ఓటు హక్కు ఉండి ఎన్నికల కమిషన్ అందజేసిన ఎపిక్‌కార్డులు (ఓటరు కార్డు) ఉన్నప్పటికీ స్థానికులు కాదనే నెపంతో వైసీపీ ఎన్నికల ఏజెం టుగా వ్యవహరిస్తున్న మండల కో-ఆప్షన్ సభ్యుడు షేక్ తానీషా అడ్డంగించి పోలింగ్ నిలుపుదల చేశారన్నారు. మండలంలో పోలింగ్ సరళిని పర్యవేక్షిస్తున్న ఆళ్లకు సమాచారం రావడంతో పోలింగ్‌బూత్ నెం. 191 వద్దకు వెళ్లి పోలింగ్ అధికారితో మాట్లాడారు. అనంతరం ఇతర పోలింగ్ కేంద్రాలను పరిశీలించేందుకు కారు వద్దకు రాగా వైసీపీకి చెందిన షేక్ రఫీ, షేక్ మౌలాలి, షేక్ అల్లాబక్షు తదితరులు సుమారు 30 మందితో వచ్చి తనపై భౌతికదాడికి దిగి దుస్తులను చించేశారని తెలిపారు. స్థానికుల సాయంతో కారులోకి ఎక్కిన తనను నిన్ను చంపేస్తాం అంటూ దుర్భాషలాడుతూ కారు అద్దాలను కర్రలతో ధ్వంసం చేశారని తెలిపారు. ఇదే సమయంలో ఘటనాస్థలానికి వచ్చిన ఫ్లైయింగ్ స్క్వాడ్ పోలీసులు వారిని చెరదగొట్టి కొత్తమల్లవల్లి నుంచి తనను బయటకు పంపిం చారని వివరించారు. తదనంతరం వీరవల్లి పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్న ఆళ్ల ఎస్సై చిరంజీవికి ఫిర్యాదు చేశారు. తనపై హత్యాయత్నానికి పాల్పడిన వైసీపీ గూండాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆళ్ల గోపాలకృష్ణ గన్నవరం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి గీతాంజలిశర్మకు విజ్ఞప్తి చేశారు.

**ఓడిపోతామని తెలిసే వైసీపీ భౌతికదాడులు**

వీరవల్లి పోలీస్‌స్టేషన్‌లో ఉన్న ఆళ్ల గోపాలకృష్ణను టీడీపీ మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు, తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయికళ్యాణి తదితరులు పరామర్శించారు. ఓడిపోతున్నామని తెలిసే వైసీపీ గూండాలు ప్రతిపక్షపార్టీ నాయకులు, ఏజంట్లపై దాడులు చేస్తున్నారన్నారు. ప్రజాస్వామ్యంలో దాడుల చేయడం అమానుషమన్నారు. గుండపనేని ఉమా వరప్రసాద్, మొవ్వా వేణుగోపాల్, ఎంపీటీసీ అమృతపల్లి సూర్యనారాయణ, మండాది రవీంద్ర, తుమ్మల ఉదయ్, నందమూరి కృష్ణప్రసాద్ తదితరులు పరామర్శించి సంఘీభావం తెలిపారు.



పోరంకిలో బారులు తీరిన ఓటర్లు



కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్న వెలగపూడి శంకరబాబు



బాపులపాడులో పోలింగ్ కేంద్రం పరిశీలనకు వెళుతూ..

# పోటెత్తిన ఓటర్లు

- పోరంకి మినహా అన్ని చోట్లా పోలింగ్ ప్రశాంతం
- పోరంకి హైస్కూల్‌లో కుటుంబ సమేతంగా ఓటు వేసిన బోడె ప్రసాద్
- పెదపులిపాకలో ఓటు వేయడానికి వచ్చి వృద్ధుడు గుండెపోటుతో మృతి



ఉయ్యూరులో సీబీఎం స్కూల్ వద్ద బారులు తీరిన ఓటర్లు

**పెనమలూరు, మే 13 :** మండలంలో పోరంకి మినహా మిగిలిన చోట్ల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. పెనమలూరు, కానూరు, తాడిగడప, పెదపులిపాక, చోడవరం తదితర గ్రామాల్లో ఉదయాన్నే ఓటర్లు ఓట్లు వేయడానికి బారులు దీరారు. టీడీపీ కూటమి అభ్యర్థి బోడె ప్రసాద్ తన కుటుంబ సభ్యులతో కలిసి పోరంకి హైస్కూల్‌లో ఓటు వేశారు. ఎండ ముదరకుండానే ఓటు వేయడానికి వచ్చిన ఓటర్లతో పోలింగ్ కేంద్రాలు కిక్కిరిశాయి. గతంలో జరిగిన ఎన్నికల్లో ఇంతలా ఓట్లు వేయడం ఎన్నడూ చూడలేదని పలువురు వ్యాఖ్యానించారు. పోరంకి ఉన్నత పాఠశాల 116వ పోలింగ్ బూత్‌లో ఈవీఎంలో సాంకేతిక లోపాలు తలెత్తి ఓటింగ్‌కు పలుమార్లు అంతరాయం కలిగింది. దీంతో సహనం నసించిన ఓటర్లు పోలింగ్ అధికారులను నిలదీశారు. పోరంకి హైస్కూల్‌లో దాదాపు 13వేల మందికి పైగా ఓట్లు వేయాల్సి ఉండడంతో అధికారులు ఓటర్లకు కావాల్సిన తగు ఏర్పాట్లు చేయడంలో విఫలమయ్యారు. ఉక్కబోతతో ఓటర్లు ఉక్కిరిబిక్కిరయ్యారు. మొదటి రెండు గంటల పోలింగ్ మందకొడిగా సాగింది. తాడిగడప కార్మికనగర్ కట్ట కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన 95నంబరు బూత్‌లో ఈవీఎం చాలా సేపు మొరాయించడంతో ఓటర్లు దాదాపు రెండు గంటల సేపు ఎండలోనే నిరీక్షించాల్సి వచ్చింది. యనమలకుదురులోని ఒక బూత్‌లో వైసీపీ ఏజెంట్లు వెంకటేష్ అనే యువకుడి ఆధార్ కార్డు చెల్లదంటూ మరోగుర్తింపు కార్డు కావాలని పట్టుబట్టడంతో ఆర్వో జోక్యం చేసుకొని అతనికి ఓటు వేసే అవకాశం కల్పించారు. తాడిగడప పద్మజానగర్ పోలింగ్ కేంద్రం 85వబూత్‌లో 12వందల ఓటర్లను కేటాయించడంతో ఓటర్లు చాలాసేపు ఇబ్బందులు పడ్డారు. పెదపులిపాకలో ఓటు వెయ్యడానికి వచ్చిన ఒక వృద్ధుడు కలగర వెంకటేశ్వరరావు(80) గుండెపోటుతో మృతి చెందడం విషాదానికి దారితీసింది.

**పోలింగ్ ప్రశాంతం**

**కంకిపాడు :** చెదురు మదురు సంఘటనలు మినహా సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. మండలంలోని మొత్తం ఓటర్లకు 54,481 గాను సాయంత్రం 7 గంటల వరకు సుమారు 75 శాతం ఓట్లు పోలయ్యాయని అధికారులు తెలియజేశారు. మండలంలోని వివిధ గ్రామాల్లో జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల సరళిని కంకిపాడు మాజీ ఎంపీపీ దేవినేని రాజా పరిశీలించారు. ఈ సందర్భంగా దేవినేని రాజా మాట్లాడుతూ, ఎన్నికల ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయన్నారు. జోగి రమేష్, ఆయన కుమారులు ఎన్నికలకు భంగం కలిగించేందుకు అల్లర మూకలతో పోలింగ్ కేంద్రాల వద్ద హడావుడి చేస్తున్నారని మండి పడ్డారు.

**మొరాయించిన ఈవీఎంలు**

మండలంలోని వివిధ గ్రామాల్లో సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన పలు పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎం మిషన్లు మొరాయించాయి. మండల కేంద్రమైన కంకిపాడులోని 178, 185 పోలింగ్ కేంద్రాలు, పునాదిపాడులోని 189, 190 పోలింగ్ కేంద్రాలు, దావులూరు గ్రామంలో పలు ఈవీ ఎంలు మొరాయించాయి. అదే విధంగా పెనమలూరు మండలంలోని వణుకూరు గ్రామంలోని 154 పోలింగ్ కేంద్రం ఇలా అనేక పోలింగ్ కేంద్రాలు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. దీంతో ఓటర్లు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కంకిపాడులోని 182వ బూతులో రాత్రి 7.30 గంటల వరకు పోలింగ్ కొనసాగింది.

**బాపులపాడు జడ్పీ హైస్కూల్‌లో**

**హనుమాన్‌జంక్షన్ :** సార్వత్రిక ఎన్నికలను పురస్కరించు కొని సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన పోలింగ్ చిన్న చిన్న వాగ్వివాదాలు మినహా ప్రశాంతంగా సాగింది. మండల కేంద్రం లో ఆరు ఏరియాల్లో 14 బూత్‌లు ఏర్పాటు చేశారు. బాపులపాడు జడ్పీ హైస్కూల్‌లో నాలుగు బూత్‌లు ఏర్పాటు చేశారు. ఉదయం 7గంటలకు ప్రారంభం కావాల్సిన పోలింగ్ హైస్కూల్‌లో బూత్‌ల్లో పది నిమిషాలు ఆలస్యంగా ప్రారంభమైంది. అప్పటికే వేసవి ఎండ తీవ్రత బాగా ఉంటుందని భావించిన ఓటర్లు క్యూకట్టారు. ఉద యం నుంచి మధ్యాహ్నం వరకు పోలింగ్ కేంద్రాలు వద్ద ఓటర్లు బారులు తీరారు. మళ్లీ సాయంత్రం మహిళలు పెద్ద సంఖ్యలో క్యూకట్టారు. రైల్వేస్టేషన్ సమీపంలోని 209 పోలింగ్ బూత్ వద్ద పోలింగ్ మందకొడిగా సాగడంతో తోపులాట జరిగింది. ఓటర్లు ఇబ్బంది పడకుండా తాగు నీరు, టెంట్లు ఏర్పాటు చేశారు. బూత్‌లు వద్దే బూత్‌లెవల్ ఆఫీసర్లు ఓటు స్లిప్పులు అందని వారికి పంపిణీ చేశారు.

**జనసేన, వైసీపీ మధ్య వాగ్వివాదం**

బాపులపాడు జడ్పీ హైస్కూల్ పోలింగ్ బూత్‌లో వైసీపీ నియోజకవర్గ పోలింగ్ పరిశీలకుడు గోసుల శివభరత్‌రెడ్డి ఎక్కువ సమయంలో బూత్‌లో ఉండడంపై టీడీపీ ఏజెంట్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త చలమల శెట్టి రమేష్‌బాబుకు శివభరత్‌రెడ్డిల మధ్య వాగ్వివాదం రేగింది. ఘర్షణ పెరగకుండా పోలీసులు ఇరువుర్ని శాంతపరిచి శివ భరత్‌రెడ్డిని బయటికి పంపించారు.పోలింగ్ కేంద్రాలను టీడీపీ గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు, మచిలీపట్నం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గొల్లు కృష్ణ బాపులపాడు కేంద్రంలోని పలు బూత్‌లను సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు.

**రంగన్నగూడెం, రేమల్లెలో..**

**హనుమాన్‌జంక్షన్‌రూరల్ :** సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా బాపులపాడు మండలంలోని సోమవారం నిర్వహించిన పోలింగ్‌కు ఓటర్లు ఉదయం నుండే బారులు తీరారు. గ్రామీణ ప్రాంతాల్లో నిలుచునేందుకు ఇబ్బందులెదురైనా ఎండవేడిమి సైతం లెక్కచేయక పోలింగ్‌బూత్‌లకు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు తరలి వెళ్లారు. ఉదయం గ6.30ని నుంచి ప్రతి పోలింగ్ బూత్ వద్ద ప్రజలు బారులుతీరి నిలుచున్నారు. మధ్యాహ్నం కొంతసేపు మంద కొడిగా సాగినా 3గంటలకు వాతావరణం చల్లబ డటంతో పోలింగ్ బూత్‌లకు ఓటర్లు పోటెత్తారు. బాపులపాడు మండలంలోని రంగన్నగూడెం, రేమల్లె, కోడూరుపాడు గ్రామాల్లో ఈవీఎంలు మొరాయించడంతో సుమారు గంటపాటు ఓటర్లు క్యూలైనల్లో పడిగాపులు పడ్డారు. బండారుగూడెం, బొమ్ములూరు, కాకులపాడు, ఆరుగొలను, కోడూరు పాడు, రేమల్లె, వేలేరు, కొత్తపల్లి, బిళ్లనపల్లి, తదితర గ్రామీణ ప్రాంతాల్లో సుమారు 82 నుంచి 91శాతం ఓట్లు నమోదయ్యాయి. సింగన్నగూడెం, కొత్తపల్లి, మల్ల వల్లి కానుమోలు గ్రామాల్లో రాత్రి 7గంటలకు కూడా ఓటు వేసేందుకు క్యూలైన్లలో ఓటర్లు వేచి ఉన్నారు.



ఆత్కూరులో బారులుతీరిన ఓటర్లు

**వైసీపీ నేతల కారు సీజ్**

ఉయ్యూరులో సీబీఎం స్కూల్ వద్ద నిలిపి ఉంచినం వైసీపీ నేతలకు చెందిన కారును ఉయ్యూరు సీఐ హబీబ్ బాషా సోమవారం సీజ్ చేశారు. ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా కారు అద్దాలపై జగన్మోహన్‌రెడ్డి స్టికర్, లోపల కరపత్రాలు, పార్టీ గుర్తులు ఉన్న ఇతర సామగ్రి ఉంది. పోలింగ్ కేంద్రం గేటు సమీపాన వైసీపీకి చెందిన కారు ఎంతో సేపు నిలిపి ఉంచడంతో కూటమి అభ్యర్థులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ హబీబ్ బాషా ఎస్సై గణేశ్‌కుమార్ ఆ కారు తాళాలు తీయించి తనిఖీ చేశారు. పార్టీ కరపత్రాలు, గుర్తులు ఉన్న సామగ్రి తప్ప నగదు లేకపోవడంతో కారును పోలీస్ స్టేషన్‌కు తరలించి సీజ్ చేశారు.

**ఉంగుటూరు మండలంలో..**

**ఉంగుటూరు:** మండలంలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియ సోమవారం ముగిసింది. ఒకటి రెండుచోట్ల చెదురుమదురు ఘర్షణలు మినహా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఉదయం ఆరున్నర గంటలకే వృద్ధులు, మహిళలు పోలింగ్ కేంద్రాల వద్ద పెద్దఎత్తున బారులు తీరారు. ఎండతీవ్రత అధికంగా వున్నా లెక్కచేయక పోలింగ్ ప్రక్రియలో ఓటర్లందరూ ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. పెదఅవుటపల్లి, పొట్టిపాడు, ఆత్కూరు తదితర గ్రామాల్లో ఈవీఎంలు, వీవీప్యాట్లు కొద్దిసేపు మొరాయించడంతో ఎన్నికల అధికారులు వాటిని వెంటనే మార్చి పోలింగ్‌ను పునఃప్రారంభించారు. సాయంత్రం ఆరుగంటలవరకు క్యూలైన్లలో నిలబడిన వారందరికీ ఓటువేసే అవకాశం కల్పించడంతో పలుగ్రామాల్లో పోలింగ్ ప్రక్రియ అర్ధరాత్రి వరకు కొనసాగింది. ఇందుపల్లి, పెదఅవుటపల్లి, పొణుకుమాడు, తదితర గ్రామాల్లో టీడీపీ -వైసీపీ కార్యకర్తల మధ్య స్వల్ప ఘర్షణలు జరుగగా, తేలప్రోలులో టీడీపీ అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు కాన్వాయ్‌పై వైసీపీ అభ్యర్థి వల్లభనేని వంశీ సమక్షంలో ఆపార్టీ కార్యకర్తలు రాళ్లదాడి చేశారు. అనంతరం పరస్పర దూషణలతో బాహాబాహీకి దిగారు. పరిస్థితి విషమించడంతో రంగంలోకి దిగిన పోలీసులు లాఠీచార్జ్ చేసి ఇరువర్గాలను చెదరగొట్టారు.

**పెదఅవుటపల్లిలో..**

పెదఅవుటపల్లి సెయింట్‌జార్జి హైస్కూల్‌లో ఏర్పాటుచేసిన నాలుగు పోలింగ్ కేంద్రాల్లో జరుగుతున్న పోలింగ్ సరళిని కాంగ్రెస్‌పార్టీ ఎంపీ అభ్యర్థి గొల్లు కృష్ణ పరిశీలించారు. అలాగే గన్నవరం జడ్పీ బాలుర హైస్కూల్‌లో ఏర్పాటుచేసిన పోలింగ్‌కేంద్రాలను ఎన్డీఏ కూటమి జనసేన ఎంపీ అభ్యర్థి వల్లభనేని బాలశౌరి సందర్శించి పోలింగ్ సరళిని ఎన్నికల అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆత్కూరులో ఉత్తరప్రదేశ్ హోంశాఖ కమీషనర్‌గా పని చేస్తున్న ఐఏఎస్ అధికారి అడుసుమిల్లి రాజమౌళి తండ్రి రామ బ్రహ్మం (90) ఓటు హక్కును వినియోగించుకోగా, వెన్నూతలలో శతాధిక వృద్ధురాలు(102) తెల్లాకుల వీర వెంకమ్మ కుమారుని సాయంతో ఓటు హక్కు వినియోగించు కున్నారు.

## ఉయ్యూరులో ఉద్రిక్తత మధ్య పోలింగ్



సీబీఎం స్కూల్ పోలింగ్ కేంద్రంలోకి గేటుతోచుకుని లోనికి వెళుతున్న వైసీపీ నాయకుడు రామచంద్రరావును అడ్డుకుంటున్న పోలీసులు

**ఉయ్యూరు, మే 13 :** ఉయ్యూరు పట్టణం, మండల పరిధిలో సోమవారం ఉద్రిక్తల మధ్య పోలింగ్ జరిగింది. పట్టణ పరిధిలో సీబీఎం స్కూల్, జిల్లాపరిషత్ హైస్కూల్, ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాల పోలింగ్ కేంద్రాల్లోని కొన్ని బూత్‌ల్లో ఈవీఎంలు మొరాయించడంతో అరగంటకు పైగా ఆలస్యంగా పోలింగ్ ప్రారంభం కావడంతో ఓటువేసేందుకు వచ్చిన వారితో పొడవాటి క్యూలు ఏర్పడ్డాయి. ఎండను సైతం లెక్క చేయక ఓటు హక్కు వినియోగించుకునేం దుకు పురుషులు, మహిళలు తరలివచ్చారు. చినఓగిరాల, ఆనందపురం, ఉయ్యూరులో కొన్ని బూత్‌లలో సాయంత్రం 8 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. పెద ఓగిరాల, బోళ్లపాడు గ్రామాల్లో వైసీపీ శ్రేణులు తెలుగుదేశం నాయకులపై దౌర్జన్యానికి దిగిదాడులకు పాల్పడ్డారు. ఉయ్యూరులో సీబీఎం స్కూల్ పోలింగ్ కేంద్రం వద్ద సాయంత్రం 6 గంటల తరువాత ఓవ్యక్తిని పోలింగ్ సిబ్బంది గేటుబయట ఉన్న ఓవ్యక్తిని బూత్‌లోకి తీసుకువెళ్లడంతో వైసీపీ నాయకుడు రాజులపాటి రామచంద్రరావు అభ్యంతరం చెబుతూ గేటుతోచుకుని స్కూల్ ఆవరణలోకి ఆవే శంగా దూసుకు వెళుతుండగా అక్కడ ఉన్న డీఎస్పీ అడ్డుకోగా ఆయనపై తిరగబడి రభస సృష్టిం చడంతో మిగతా పోలీసు సిబ్బంది వచ్చి రామచంద్రరావును గేటు బయటకు పంపించారు. దీంతో అక్కడున్న వైసీపీ శ్రేణులు పోలీసులతో వాగ్వాదానికి దిగి అలజడి సృష్టించారు. పట్టణ ఎస్సై, సీఐలు వచ్చి ఆందోళన చేస్తున్న వైసీపీ నాయకులకు సర్దిచెప్పి పంపించి వేశారు. ఓటు వేసి వ్యక్తి సంతకం చేయకపోవడంతో అతనిని పిలిపించి లోనికి అనుమతించామని, సమయం దాటిన తరువాత గేటు బయట ఉన్న అతనిని ఓటు వేసేందుకు పిలవలేదని పోలీంగ్ సిబ్బంది తెలిపారు.





కానుమోలులో ఓటువేసేందుకు బారులు తీరిన మహిళలు



# మార్పు కోసం.. మేము సైతం..

**హనుమాన్‌జంక్షన్ / రూరల్, మే 13 :** గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ అరాచక పాలన నుంచి రాష్ట్రాన్ని కాపాడాలన్న కసి సోమవారం జరిగిన ఎన్నికల పోలింగ్‌కు వచ్చిన ప్రజల్లో కనిపించింది. పోలింగ్ కేంద్రాల్లో అధికారులు ఈవీఎం మిషన్లు తెరవక ముందు నుంచే బాపులపాడు మండలంలోని అనేక బూత్‌లు ముందు ఓటర్లు క్యూకట్టడమే దీనికి నిదర్శనం. రాష్ట్ర భవిష్యత్తును మార్చేది ఓటు ద్వారానే కదా.... ఒకసారి జగన్ పరిపాలన చూసాం. ఇపుడు కూటమికి అవకాశం ఇద్దామన్న అభిప్రాయం ప్రజల్లో కనిపించింది. కొత్తగా ఓటు వచ్చిన యువతీ యువకుల్లో నూతన ఉత్సాహం కనిపింది. గ్రామీణ ప్రాంతాలతో పాటు విదేశాల్లోని ప్రవాసాంధ్రులు, విదేశాల్లో చదువుకుంటున్న యు వత తమ ఓటు హక్కును వినియోగించుకునేం దుకు క్యూలైన్లలో గంటల తరబడి ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. ● ఆస్ట్రేలియాలోని క్వీన్‌లాండ్‌లో ఉద్యోగాలు చేసుకుంటున్న రేమల్లెకు చెందిన ఎన్నారై యనమదల నరసింహారావు, హారిక దంపతులు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు లక్షల వ్యయంతో స్వగ్రామానికి వచ్చారు. రేమల్లెలోని పోలింగ్ బూత్‌లో ఈవీఎం మొరాయించినా రెండు గంటల పాటు క్యూలైన్‌లో వేచి ఉండి ఓటును సద్వినియోగం చేసుకున్నారు. భావితరాల భవిష్యత్తు కోసం తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నట్లు వారు తెలిపారు.

● ఫ్లోరిడాలో ఎంఎస్ చదువుకుంటున్న రంగన్నగూడెంకు చెందిన మొవ్వా సాయికృష్ణ తమ మొట్టమొదటి ఓటును సద్వినియోగం చేసుకోవడంపట్ల హర్షం వ్యక్తం చేశారు. తన భవిష్యత్తు కోసం రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కును మొట్టమొదటిగా రాష్ట్ర భవిష్యత్తు కోసం సద్వినియోగం చేయడం ఆనందంగా ఉందని తెలిపారు.

ఇదే బాటలో కానుమోలు, బాపులపాడు, కొత్తపల్లి గ్రామాల్లోని ఎన్నారైలు, యువత తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.





రేమల్లెలో ఓటు వినియోగించుకున్న ఎన్నారై దంపతులు, విదేశాల్లో చదవుకుంటున్న మొవ్వా సాయికృష్ణ

**రాష్ట్ర భవిష్యత్తు బాగుపడాలని..**



ఓటు చాలా విలువైనదని పుస్తకాల్లో చదువుకున్నాను. ఇపుడు తొలి సారి ఓటు వేసే అవ కాశం వచ్చింది. నా ఓటు ద్వారా రాష్ట్ర భవిష్యత్తు మారుతుందన్న ఆశగా ఉందని బాపులపాడుకు చెందిన బీ.ఫార్మసీ విద్యార్థిని కడియాల శ్రీపద్మ తన తొలి ఓటు అనుభవాన్ని తెలిపారు.

**యువతకు ఉద్యోగ ఉపాధి పెరిగాలి**



డిగ్రీలు చదువుకొని బయటికి వస్తున్నాం. గత ప్రభుత్వ హయాంలో ఉపాధి అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయి. ఈ సారి ప్రభుత్వం యువతకు ఉపాధి అవకాశాలు చూపించాలని ఆశిస్తున్నానని బాపులపాడుకు చెందిన బీటెక్ విద్యార్థిని వంగపండు స్పందన వ్యక్తం చేశారు.

**రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలి**



ప్రజలకు సంక్షేమంతో పాటు అభివృద్ధి ఫలాలను కూడా అందించాల్సిన అవసరం పాలకులకు ఉందని బాపులపాడు కు చెందిన కోడే మౌనేష్ తెలిపారు. మొదటిసారిగా ఓటు వేయడం ఉత్సాహాన్ని నింపిందని, ప్రతి ఒక్కరూ ప్రజాశ్రేయస్సు కాంక్షించాలన్నారు.

## కేంద్రీయ విద్యాలయంలో నూరుశాతం ఉత్తీర్ణత

**మచిలీపట్నం టౌన్, మే 13 :** మచిలీపట్నం పీఎం కేంద్రీయ విద్యాలయం విద్యార్థులు పరీక్షల్లో ప్రతిభను చాటారు. కేంద్రీయ విద్యాయం విద్యార్థులు 10, 12 తరగతుల పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించినట్టు ప్రిన్సిపాల్ మహమ్మద్ ఆసీఫ్ హుస్సేన్ తెలిపారు. 10వ తరగతిలో అపూర్వ 89.3 శాతం సాధించి స్కూల్ టాపర్‌గా నిలిచిందన్నారు. 12వ తరగతిలో కుంపటి అక్షయమౌళి 91.6 శాతం సాధించి స్కూల్ టాపర్‌గా నిలిచిందన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రిన్సిపాల్ మహమ్మద్ ఆసీఫ్ హుస్సేన్ అభినందించారు.





సర్కిల్‌పేట పోలింగ్ కేంద్రంలో ఓటేస్తున్న కొల్లు రవీంద్ర, సుకర్లాబాద్‌లో బారులు తీరిన ఓటర్లు



కృత్తివెన్నులో బారులు తీరిన ఓటర్లు, పల్లెపాలెం బూత్‌ను సందర్శిస్తున్న కాగిత కృష్ణప్రసాద్



పాములలంక బూత్ వద్ద ఓటర్ల రద్దీ, మోడల్ పోలింగ్ బూత్‌లో ఓటేస్తున్న కల్పన, కూచిపూడి పోలింగ్ కేంద్రం సందర్శిస్తున్న కుమార్‌రాజా

# ఉరకలేసిన ఓటరు చైతన్యం

**● భారీగా పెరిగిన పోలింగ్ ● స్వల్ప ఘటనలు ● అక్కడక్కడా మొరాయించిన ఈవీఎంలు**

**మచిలీపట్నం టౌన్, మే 13 :** మచిలీపట్నం నగరంలో వివిధ కేంద్రాల్లో సోమవారం ఉదయం 11 గంటలకే ఓటర్లు బారులు తీరారు. హిందూ కళాశాలలో ఎన్నికల అధికారులు వేసిన టెంట్లు, కుర్చీలు చాలకపోవడంతో మళ్ళీ అదనంగా టెంట్లు, కుర్చీలు వేయించారు. బెంగుళూరు, చెన్నై, హైదరాబాద్, అమెరికా నుంచి పలువురు ఓటర్లు మచిలీపట్నం వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మచిలీపట్నం నగరంతో పాటు రెండు గ్రామాలలో ఈవీయంలు మొరాయించాయి. బ్యాటరీ డౌన్ కావడంతో గొడుగుపేట, రాజుపేట, ఇనగుదురుపేట, పిటిపాలెంలో ఈవీయంలలో బ్యాటరీ డౌన్ కావడంతో మొరాయించాయి. దీంతో దాదాపు అరగంట సేపు పోలింగ్ ఆగిపోయింది. క్యూలో ఓటర్లు బారులు తీరారు. సెక్టోరియల్ అధికారులు హుటాహుటి బ్యాటరీలు రిప్లేస్ చేయడంతో ఓటింగ్ కొనసాగింది.

### స్వల్ప ఘటనలు

**మచిలీపట్నం టౌన్ :** చిలకలపూడి మునిసిపల్ హైస్కూల్ వద్ద ఉన్న పోలింగ్ కేంద్రంలో టీడీపీ, వైసీపీ కార్యకర్తల మధ్య స్వల్ప వాగ్వాదం జరిగింది. బుద్దాలపాలెం, తాళ్ళపాలెం, పీటీ పాలెం గ్రామాల్లో టీడీపీ, వైసీపీ కార్యకర్తలు ఘర్షణకు దిగారు. లోపల బారులు తీరి ఉన్న ఓటర్లకు ఓటు వేయాలని చెప్పడం తగదని టీడీపీ నాయకులు వాగ్వాదానికి దిగారు. **పెడన :** పోలింగ్ బూత్‌ల వద్ద వైసీపీ నాయకులు చేస్తున్న ప్రచారాన్ని టీడీపీ నాయకులు అడ్డుకోవడంతో తోటమూల, బ్రహ్మపురం, బస్టాండ్ ప్రాంతాల్లో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మచిలీపట్నం పార్లమెంటు జనసేన పార్టీ అభ్యర్థి బాలశౌరి, పెడన నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్, వైసీపీ అభ్యర్థి ఉప్పాల రాము సతీమణి, జడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక బంగ్లా స్కూల్ పోలింగ్ బూత్‌లను సందర్శించి పోలింగ్ తీరును పరిశీలించారు. **పెడన రూరల్ :** మండలంలో 44 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. అధికార పార్టీ నాయకులు కొన్ని చోట్ల నిబంధనలు ఉల్లంఘించి పోలింగ్ బూత్‌లలోకి దూసుకెళ్ళారు. ఉరివిలో ఓటర్లకు యువకులు మజ్జిగ పంపిణీ చేశారు. ఎన్నికల సమయం ముగిసేసమయానికి మడక, బల్లిపర్రు, నందమూరు, పెదనందమూరు కేంద్రాలలో ఓటర్లు వేచియున్నారు. వారికి స్లిప్‌లు అందించారు. **బంటుమిల్లి :** మండలంలో చిన్న చిన్న సంఘటనలు మినహాయించి ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. తుమ్మిడి అర్తమూరు, సాతులూరు మరికొన్ని ప్రాంతాల్లో ఈవీఎంలు మొరాయించడంతో ఓటింగ్ మందకొడిగా సాగింది. బంటుమిల్లి ఎస్సై వాసు తన సిబ్బందితో ఎన్నికలు సజావుగా జరిగేందుకు కృషి చేశారు. **కృత్తివెన్ను :** కృత్తివెన్ను మండలంలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. పోలింగ్ కేంద్రాలన్నీ రద్దీగా మారటంతో ఓటర్లు ఉక్కపోతకు గురై, తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలు కేంద్రాల వద్ద కూలర్లను కూడ ఏర్పాటు చేశారు. టీడీపీ అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్, వైసీపీ అభ్యర్థి ఉప్పాల రమేష్ వేర్వేరుగా పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. చినపాండ్రాక గ్రామంలో ఉదయం ఓటు వేసేందుకు వెళ్ళిన ఇద్దరు మహిళల ఓట్లు వేరే వారు వేసినట్లు గుర్తించిన అధికారులు వారికి చాలెంజ్ ఓటు హక్కు సదుపాయం కల్పించారు. **గుడివాడ :** గుడివాడ నియోజకవర్గంలో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. తొలి ఓటు పొందిన యువ ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఏర్పాట్లు చేయడంలో అధికారుల డొల్లతనం బయపడింది. బూత్ నెం. 112, 113లలో సరైన వసతులు లేకపోవడంతో ఓటర్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నియోజకవర్గంలో చాలా చోట్ల ఈవీఎంలు మొరాయించడంతో ఆలస్యంగా పోలింగ్ మొదలైంది. . ఎస్పీఎస్, ఏజీకే ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రాల్లో ఎన్ఆర్ఐలు అధిక సంఖ్యలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. గుడివాడ మండలం చిరిచింతలలో రాత్రి 8 గంటల సమయంలో ఈవీఎం మొరాయించింది. ఇందిరా నగర్‌కాలనీలోని 155, 156 పోలింగ్ బూత్‌లలో పోలింగ్ సమయం ముగిసిందని చెప్పి లోనికి రానివ్వకుండా ఎన్నికల అధికారులు అడ్డుకున్నారు. జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు రిటర్నింగ్ అధికారితో మాట్లాడటంతో అనుమతిచ్చారు. **నందివాడ :** మండలంలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఓటర్లు ఎండను సైతం లెక్క చేయకుండా ఓటు హక్కును పూర్తిగా వినియోగించుకున్నారు. **గుడ్లవల్లేరు :** మండలంలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. 188 నెంబరు బూత్‌లో ఈవీఎం ప్రాంభంలోనే మొరాయించగా కొత్త ఈవీఎంను ఏర్పాటు చేశారు. మండలంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా పోలింగ్ 89.39 శాతం ఓట్లు పోలయ్యాయి. **పామర్రు :** పామర్రు ఎన్నికల రిటర్నింగ్ అధికారి బి.శ్రీదేవి ఎప్పటికప్పుడు పోలింగ్ సరళిని పరిశీలించి సంబంధిత అధికారులకు సూచనలు, సలహాలు అందించారు. పామర్రు దాదాపు 12 పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించడంతో నియోజకవర్గ ఎన్నికల అధికారి వెంటనే వాటి స్థానంలో ఈవీఎంలను తెప్పించి పోలింగ్ సక్రమంగా జరిగేలా చేశారు. మొవ్వ, పామర్రు, పమిడిముక్కల మండలాల్లో మూడు చోట్ల కొన్ని ఇబ్బందులు తలెత్తటంతో పోలింగ్ ఆలస్యంగా మొదలైంది. నియోజకవర్గంలో 78.25 శాతం ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. **పెదపారుపూడి :** మండలంలో పోలింగ్ ప్రశాంతంగా జరిగిందని ఏఈఆర్‌వో కె.వి.మాధవరావు తెలిపారు. మండలంలో 80 శాతం ఓటింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారి తెలిపారు. **అవనిగడ్డ :** అవనిగడ్డ నియోజకవర్గంలో పలు చోట్ల ఈవీఎంలు మొరాయించటంతో ఓటర్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నాగాయలంక మండల పరిధిలోని కమ్మనమోలులో ఈవీఎంలు మొరాయించటంతో దాదాపు గంటకుపైగా పోలింగ్ ప్రక్రియ ఆలస్యమైంది. తలగడదీవిలో ఈవీఎం బ్యాటరీ పని చేయకపోవటంతో పోలింగ్ దాదాపుగా అరగంటపాటు నిలిచిపోయింది. వేకనూరు గ్రామం లో వీసీ ప్యాట్ పని చేయకపోవటంతో పోలింగ్ గంటకుపైగా ఆలస్యంగా జరిగింది. మోపిదేవి మండలం వెంకటాపురం పోలింగ్ కేంద్రంలో దాదాపు అర గంటకుపైగా ఈవీ ఎం మొరాయించింది. బెల్ కంపెనీ నుంచి వచ్చిన ముగ్గురు ఇంజనీర్లు, జిల్లా స్థాయిలో శిక్షణ పొందిన ఆరుగురు సాంకేతిక నిపుణుల సహకారంతో ఆర్వో బాలసుబ్రహ్మణ్యం ఈవీఎం సమస్యలను పరిష్కరించి పోలింగ్ సజావుగా జరిగేలా చర్యలు తీసుకున్నారు. బందలాయిచెరువు పోలింగ్ కేంద్రం వద్ద జనసేన, వైసీపీ నడుమ స్వల్ప ఘర్షణ తలెత్తింది. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రమేష్‌బాబు, జనసేన అభ్యర్థి కుమారుడు మండలి వెంకట్రామ్ ఒకేసారి పోలింగ్ కేంద్రంలో ఉండటంతో ఎక్కడ శాంతిభద్రతల సమస్య తలెత్తుతుందోననే ఆందోళన కలిగింది. ఇరువర్గాల మధ్య కవ్వింపు చర్యలు జరిగినప్పటికీ మొత్తం మీద పోలింగ్ ప్రక్రియకు ఆటంకం లేకుండా జరిగింది. నియోజకవర్గంలో దాదాపు 86 శాతం మేర పోలింగ్ నమోదైందని ఎన్నికల అధికారి బాలసుబ్రహ్మణ్యం, అవనిగడ్డ తహసీల్దార్ నాగేశ్వరరావు తెలిపారు. **అవనిగడ్డ రూరల్ :** అధికార పార్టీకి చెందిన కొందరు పోలింగ్ కేంద్రాల వద్ద ప్రచారం చేశారు. తుంగలవారిపాలెంలో సర్పంచ్ స్వయం గా ప్రచారం చేస్తూ ఓటర్లకు డబ్బులు ఎర చూపారు. మోదుమూడిలో అధికార వైసీపీ, ప్రతిపక్ష జనసేనకు స్వల్ప ఘర్షణ జరిగింది. అవనిగడ్డలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అందె శ్రీరామమూర్తి తన సతీమణితో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. **కూచిపూడి :** మొవ్వ మండలంలో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. మొవ్వపాలెంలో గంటకు పైగా ఈవీఎంలు మొరాయించాయి. మొవ్వలో వైసీపీ అభ్యర్థి కైలే అనిల్ కుమార్, కూచిపూడిలో కూటమి అభ్యర్థి వర్ల కుమార్ రాజా ఓటింగ్ సరళిని పరిశీలించారు. సమస్యాత్మక గ్రామాల్లో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. **తోట్లవల్లూరు :** మండలంలో ఓటర్లు పోటెత్తారు. తోట్లవల్లూరు 10వ బూత్‌లో గంటన్నర సేపు, భద్రిరాజుపాలెం 19వ బూత్‌లో మూడు గంటల సేపు, బొడ్డపాడులో రెండు బూత్‌లలో ఈవీఎంలు పనిచేయక ఓటింగ్ ఆలస్యం అయింది. యాకమూరు 22వ బూత్‌లో ఓటింగ్ ఆలస్యంగా జరగటంతో క్యూలో నిలబడిన రమాదేవి అనే మహిళ స్పృహతప్పి పడిపోవటంతో ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం ఉయ్యూరు తరలించారు. తోట్లవల్లూరు 10, 11 బూత్‌లలోకి ఓటర్లు వెళ్ళేందుకు ఓకే దారి ఉండటంతో దివ్యాంగులు గంటల తరబడి షామియానా కింద నిరీక్షించారు. పాములలంకలో రాత్రి 8 గంటలకు కూడా ఓటింగ్ జరుగుతూనే ఉంది. **మోపిదేవి :** బొబ్బర్లంక, ఉత్తర చిరువోలులంక, కోసూరువారిపాలెం, వెంకటాపురం, కె.కొత్తపాలెం గ్రామాల్లో ఈవీఎంలు మొరాయించి 30 నిముషాలు ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. వెంకటాపురం, కోసూరువారిపాలెం గ్రామాల్లో ఇరుకుగా ఉండే చిన్న గదిలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయటంతో ఓటర్లు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. కోసూరువారిపాలెం, వెంకటాపురం గ్రామా ల్లో వినియోగించుకునేందుకు వేచి ఉన్నారు. బొబ్బర్లంక, రావివారిపాలెం, కప్తానుపాలెం, మేళ్లమర్తిలంక గ్రామాల్లో పోలింగ్ 95 శాతం జరిగింది. మోపిదేవి, పెదప్రోలు, కప్తానుపాలెంలలో వల్లభనేని బాలశౌరి, మండలి బుద్ధప్రసాద్‌లు పోలింగ్ సరళిని తెలుసుకున్నారు. వెంకటాపురంలో రాత్రి 7 గంటల నుంచి విద్యుత్ సరఫరా నిలిపి వేశారు. గంటకుపైగా అంతరాయం కలగటంపై ఓటర్లు అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మోపిదేవి లంక పోలింగ్ కేంద్రం వద్ద టీడీపీ, వైసీపీ వర్గీయులు ఘర్షణ పడ్డారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి చెల్లాచెదురు చేశారు. **ఘంటసాల:** స్వల్ప ఘటనలు మినహా పోలింగ్ మండలంలో ప్రశాంతంగా జరిగింది. సమస్యాత్మక గ్రామాలైన శ్రీకాకుళం, కొడాలి కేంద్రాల్లో కేంద్ర బలగాలను మోహరించారు. సాయంత్రం ఆరు గంటలకల్లా అన్ని గ్రామాల్లో పోలింగ్ ప్రక్రియపూర్తి కాగా, శ్రీకాకుళం గ్రామంలో రాత్రి 7.30 వరకు పోలింగ్ కొనసాగుతూనే ఉంది. **చల్లపల్లి :** మండలంలో ప్రశాంత వాతావరణంలో పోలింగ్ ముగిసింది. పుచ్చగడ్డలో రాత్రి 8గంటల వరకు, పాగోలు బూత్‌లో ఏడు గంటల వరకు పోలింగ్ జరిగింది. చల్లపల్లి జేబీ స్కూల్ లోని ఓ బూత్‌లో, వక్కలగడ్డలోని మరో బూత్‌లో పోలింగ్ అరగంట ఆలస్యంగా ప్రారంభమైంది. ఆముదార్లంకలో అత్యధికంగా 89శాతం పోలింగ్ నమోదైంది. పాగోలులోని మూడు 88 శాతం పోలింగ్ నమోదైంది. **నాగాయలంక :** మండలంలో పోలింగ్ 87.38 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. మర్రిపాలెం, సంగమేశ్వరం, పోలింగ్ బూత్‌లో ఈవీఎంలు కొద్దిసేపు మొరాయించటంతో అధికారులు చక్కదిద్ది పోలింగ్‌ను కొనసాగించారు. **కోడూరు :** మండలంలో మొత్తం 86.69 శాతం పోలింగ్ నమోదు అయింది. విశ్వనాథపల్లి గ్రామంలో రాత్రి 8 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగింది. 91 శాతం పోలింగ్ నమోదు కావటంతో ఓటింగ్ ఆలస్యమైనట్లు అధికారులు తెలిపారు.

### ఓటేసిన ప్రముఖులు



కంకటావలో వేదవ్యాస్

**మచిలీపట్నం టౌన్ :** మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి కొల్లు రవీంద్ర సోమవారం ఉదయాన్నే ఓటు హక్కును వినియోగించుకున్నారు. కొల్లు రవీంద్రతో పాటు ఆయన సతీమణి కొల్లు నీలిమ, కుమారుడు పునీత్‌చంద్ర తదితరులు ఓటు వేశారు. మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, టీడీపీ కార్పొరేటర్లు చిత్తజల్లు నాగరాము, మరకాని సమతాకీర్తి తదితరులు ఉదయాన్నే తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఉపసభాపతి బూరగడ్డ వేదవ్యాస్ గూడూరు మండలం కంకటావలో కుమారుడు కిషన్ తేజ్, కుటుంబ సభ్యులతో కలసి సోమవారం ఉద యం ఓటు హక్కు వినియోగించుకున్నారు. అమెరికా, చెన్నై, బెంగుళూరు తదితర ప్రాంతాల నుంచి చంద్రబాబు, పవన్‌కల్యాణ్ పిలుపు మేరకు పలువురు అభిమానులు వచ్చి ఓటేశారని, కూటమి విజయం తథ్యమని మాజీ మంత్రి, మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి కొల్లు రవీంద్ర, మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి వల్లభనేని బాలశౌరి ధీమా వ్యక్తం చేశారు. **బంటుమిల్లి :** పెడన నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్ నాగేశ్వరరావుపేటలో సతీమణి శిరీష, తల్లి మాణిక్యం, ఇతర కుటుంబ సభ్యులతో వచ్చి 140వ పోలింగ్ బూత్‌లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. **గుడివాడ :** గుడివాడ నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాము, ఎమ్మెల్యే కొడాలి నాని, ప్రముఖ దర్శకుడు వై.వి.ఎస్ చౌదరి టౌన్ హైస్కూల్‌లోని బూత్ నెం.63లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. టీడీపీ మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు పోలింగ్ సరళిని పరిశీలించారు. **అవనిగడ్డ :** మండలి బుద్ధప్రసాద్, సింహాద్రి చంద్రశేఖర్, సింహాద్రి రమేష్‌బాబులు సోమవారం అవనిగడ్డలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. జనసేన అభ్యర్థి మండలి బుద్ధప్రసాద్ ఆయన సతీమణి విజయలక్ష్మితో కలసి అవనిగడ్డలోని జూనియర్ కళాశాల పోలింగ్ కేంద్రంలో తన ఓటు హక్కును వినియోగించుకోగా, మచిలీపట్నం వైసీపీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్ గురవ్పుచెరువు బూత్‌లో తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎమ్మెల్యే సిం హాద్రి రమేష్‌బాబు జడ్పీ ఉన్నత పాఠశాలలోని కేంద్రంలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. **చల్లపల్లి :** చల్లపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లోని పోలింగ్ బూత్‌లో మాజీ ఎమ్మెల్యే పాటూరు రామయ్య ఓటు హక్కు వినియోగించుకున్నారు. మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలసౌరి, ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, అవనిగడ్డ నియోజకవర్గ కూటమి అభ్యర్థి మండలి బుద్ధప్రసాద్ పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. **పామర్రు :** పామర్రులోని 164వ బూత్‌లో సిట్టింగ్ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, అసెస్సీ పాఠశాల 144వ బూత్‌లో టీడీపీ అభ్యర్థి వర్లకుమార్‌రాజా తన సతీమణి విశ్రమ, తల్లిదండ్రులు జయపద్ర, రామయ్యలతో కలిసి తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పామర్రు మాజీ ఎమ్మెల్యే డి.వై.దాస్ మార్కెట్ యార్డుని 148 బూత్‌లో, 144వ నెంబరు మోడల్ పోలింగ్ కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే ఉప్పులేటి కల్పన తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.



పామర్రులో డి.వై.దాస్



చల్లపల్లిలో పాటూరు రామయ్య






గుడ్లవల్లేరు, అవనిగడ్డలో తొలి ఓటు వేసిన యువతులు

### అభ్యర్థుల భవిత మార్చనున్న యువత

**అవనిగడ్డ :** సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా అవనిగడ్డ నియోజకవర్గంలో కొత్తగా ఓటు హక్కు పొందిన యువతే అభ్యర్థుల భవితను మార్చబోతున్నారా? అన్న రీతిలో అవనిగడ్డ నియోజకవర్గంలో సోమవారం పోలింగ్ కొనసాగింది. అత్యధికులు తొలిసారిగా తమ ఓటు హక్కు ను వినియోగించుకోగా, దీనికి తోడు నియోజకవర్గంలోని ఆరు మండలాలకు హైదరాబాద్, బెంగుళూరు తదితర ప్రాంతాల్లో స్థిరపడిన యువత దాదాపుగా 12 వేల మంది యువత ఓటు వేసేందుకు తరలి రావటంతో ఈ మొత్తం 16 వేల మంది యువకులు వేయబోయే ఓటు అభ్యర్థుల భవితను తారుమారు చేసేయగలదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

### విదేశాల నుంచి వచ్చి ఓటేశారు!

**పెడన రూరల్ :** విదేశీ విద్య కోసం ఏడాది క్రితం అమెరికా వెళ్లిన యర్రంశెట్టి సాయిరామ్ స్వగ్రామం చెన్నూరులో ఓటు హక్కు వినియోగించుకున్నాడు. జనసేన అభిమానిగా, పవన్‌కల్యాణ్ గెలుపుకోసం అమెరికా నుంచి వచ్చి పిఠాపురంలో నాలుగురోజులు 50 గ్రామాల్లో ప్రచారం చేశానన్నాడు. యువత కోసం విజన్ ఉన్న పవన్ వంటి నాయకులు సమాజానికి అవసరమన్నాడు.



అమెరికా నుంచి వచ్చిన యర్రంశెట్టి సాయిరామ్

**ఫ్రాన్స్ నుంచి..**

**పెదపారుపూడి :** ఫ్రాన్స్ రాజధాని ప్యారిస్‌లో చదువుతున్న మొవ్వ సాయి లోకేష్ స్వగ్రామం వెంట్రప్రగడ శివారు శివాపురంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. గ్రామస్థులు అభినందించారు.



మొవ్వ సాయి లోకేష్

**కెనడా నుంచి..**

**నాగాయలంక :** కెనడాలోని డల్హౌసీ యూనివర్సిటీలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్న భావదేవరపల్లికి చెందిన ఆవుల సాయి జ్ఞానేష్ తన తొలి ఓటు ను వినియోగించుకున్నారు.



ఆవుల సాయి జ్ఞానేష్

**ఐర్లాండ్, అమెరికా..**



గోకుల్ సాయిరామ్



గొట్టిపాటి ఆదిత్య

**గుడ్లవల్లేరు :** ఐర్లాండ్ నుంచి వచ్చి స్వగ్రామం విన్నకోట గ్రామంలో గోకుల్ సాయిరామ్ ఓటుహక్కును వినియోగించుకొనగా, డోకిపర్రు గ్రామంలో గొట్టిపాటి ఆదిత్య అమెరికా నుంచి వచ్చి తన తొలి ఓటు హక్కును వినియోగించుకున్నారు.





## తిరిగి వెళ్లేందుకు బస్సులు లేక ఓటర్ల ఇబ్బందులు



అవనిగడ్డ డిపోలో బస్సుల కోసం ఎదురుచూస్తున్న యువకులు

**అవనిగడ్డ, మే 13 :** సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఓట్లు వేసేందుకు స్వగ్రామాలకు వచ్చిన నియోజకవర్గ ప్రజలు తిరిగి వెళ్లేందుకు బస్సులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హైదరాబాద్, బెంగుళూరు, విశాఖపట్నం తదిరత ప్రాంతాల నుంచి దాదాపుగా 12 వేల మందికిపైగా యువకులు అవనిగడ్డ నియోజకవర్గంలోని స్వగ్రామాలకు తరలి వచ్చారు. ఎన్నికల ప్రక్రియ ముగియటంతో తిరిగి వెళ్లేందుకు బస్సులు లేక పడరాని పాట్లు ఎదుతున్నారు. హైద రాబాద్ వెళ్లేందుకు ఆర్టీసీ ప్రత్యేకంగా స్పెషల్ సర్వీసులను ఏర్పాటు చేసినప్పటికీ అవి చాలక, వాటి సమాచారం ఆన్‌లైన్‌లో లభ్యం కాక, ఉన్న బస్సులు చాలక ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యేకంగా బస్సులు పెట్టకపోవటంతో అటువైపు వెళ్లే వారు గుడివాడ జంక్షన్ వెళ్లి ప్రైవేట్ సర్వీసుల ద్వారా వెళ్లాలని చూసినా సాధారణ సర్వీసులు కూడా లేక బస్టాండ్‌లో పడిగాపులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. పెద్ద సంఖ్యలో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి తిరిగి వెళ్లేందుకు ఆర్టీసీ తగిన ఏర్పాట్లు చేయకపోవటం పట్ల నిరుద్యోగులు, ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## తోట్లవల్లూరు, గుర్విందపల్లిలో ఘర్షణలు



తోట్లవల్లూరు జడ్పీ హైస్కూల్ వద్ద వైసీపీ, టీడీపీ కార్యకర్తల ఘర్షణ

**తోట్లవల్లూరు :** మండలంలో సోమవారం జరిగిన ఎన్నికల్లో రెండు గ్రామాల్లో వైసీపీ, టీడీపీ మధ్య ఘర్షణలు చోటు చేసుకున్నాయి. తోట్లవల్లూరు జడ్పీ హైస్కూల్లోకి వైసీపీ నాయకులను అనుమతించటం, టీడీపీ నాయకులను నిలిపివేయటంపై తలెత్తిన వివాదం రెండు పార్టీల కార్యకర్తలు బాహాబాహీకి దిగారు. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి ఇరు వర్గాలను చెదరకొట్టి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. గుర్విందపల్లి పోలింగ్ బూత్‌లోకి మండల వైసీపీ అధ్యక్షుడు కళ్ళం వెంకటేశ్వరరెడ్డి వెళ్ళటంతో టీడీపీ కార్యకర్తలు అభ్యంతరం వ్యక్తం చేయటంతో మమ్మలనే నిలదీసేవాళ్ళా? అని వైసీపీ కార్యకర్తలు వాగ్వాదానికి దిగారు. పోలీసులు రావటంతో ఈ గొడవ పోలింగ్ బూత్ వద్ద సద్దుమణగగా వాటర్‌ట్యాంకు దగ్గర మళ్ళీ గొడవ చెలరేగింది. మహిళలు జుట్లు పట్టుకుని కొట్టుకున్నారు. తరువాత పురుషులు రంగప్రవేశం చేశారు. ఈ గొడవతో టీడీపీకి చెందిన గుమ్మడి కోటేశ్వరరావు, భార్య పద్మ, గుమ్మడి నాగరాజులకు గాయాలవగా ఉయ్యూరు ఆస్పత్రికి తరలించారు. పోలీస్ బందోబస్తు తగినంతగా ఏర్పాటు చేయకపోవటం విమర్శలకు దారితీసింది.